కుమారి లలితాకుమారి ఆ రోజు సందిగ్ధావస్థలో పడ్డది. తన మనో భావాలు తనకే అర్థం కావడం లేదు. పెళ్లి అంటే తనకు భయం లేక పోయినప్పటికీ పెళ్లి గురించి నికరమైన అభిప్రాయాలు ఏవీ లేవు.— కనీసం తన పెళ్లి గురించి.

ఆమె రాసిన వంద పైచిలుకు కథల్లో చాలా సార్లు పెళ్లీ, ప్రేమా గురించి తన పాత్రల చేత వాగ్వాదాలు జరిపించింది. ప్రేమలేని పెళ్లిళ్ల మీదా పెళ్లిని కోరని ప్రేమ మీదా డజన్ల కొద్దీ కథలు రాసింది. పెళ్లయిన భార్యా భర్తల మధ్య కీచులాటలూ, భార్యలను కుక్కల కన్నా హీనంగా చూసే భర్తలనూ సృష్టించింది. పవిత్ర ప్రేమ కల ప్రేమికులు ఆత్మహత్యలు చేసుకోవటమూ, సంఘానికి ఎదురాడి ఎన్ని కష్టాలు వచ్చినా సహించి, కొండలూ, గుట్టలూ ఎక్కి, నదులు దాటి మనసారా ప్రేమించిన యువతిని కథానాయకుడు చేపట్టిన ఘట్టాలు ఎన్నో సృష్టించింది.

కాని తనకు మాత్రం వాటివంటి ఏ ఒక అవకాశం లభించలేదు. కాబట్టి వాటి యాదార్థ్యం ఆమెకు తెలీదనే చెప్పాలి. ఆమెకు జీవితం గురించి అనుభవం కన్న, పరిజ్ఞానం ఎక్కువ. ఆమె కథానాయికలు మాత్రం ఏ ప్రబంధ నాయికకూ తీసిపోరు. వారందరికీ శాస్త్ర, కళా సాహిత్య పిపాస ఉంటుంది. వాళ్లు పుస్తకాలు — ఇంటి పని చేస్తారో, చెయ్యరో, మనకు తెలీదు — ఇరవై నాలుగు గంటలూ చదువుతారు. జుట్టు కత్తిరించుకుని, పెదాలకు రంగులు వేసుకునే స్త్రీలు కూడా ఆవిడ కథల్లోకి తొంగి చూస్తూ వుంటారు. కాని వాళ్లు దుష్ట వర్గానికి చెందిన వాళ్లు. ఆవిడ కథల్లో ఇంకొక ప్రత్యేకత ఏమిటంటే కథానాయకుడూ, కథా నాయికా ఒకళ్లనొకళ్లు ముట్టుకోరు. కనీసం ఓ పది అడుగులు దగ్గరగానైనా రారు. మనుషుల్లో 'రేడియో యాక్టివ్' కిరణాలు లేవని ఏం నమ్మకం? అందుచేత అవివాహితులైన ప్రేమికుల చేత అప్రాచ్యపు పనులు చేయించటం ఆవిడకు అలవి కాని పని. ఎంత 'షార్ట్ షాట్'గా పెళ్లి కాబోతున్నప్పటికీ వాళ్లు కావిలించుకోవటమూ ముద్దు పెట్టుకోవటమూ చాలా చౌకబారు వీధి వేషాలుగా కనిపించేవి ఆవిడకు. అంత ఆత్రం వుంటే పెళ్లయే వరకూ ఆగవచ్చుగా? మొదటి రాత్రి ఆలీలన్నీ జరుపుకో వచ్చుగా? చిక్కేమిటంటే ఆవిడ దానికి కూడా ఒప్పుకోదల్లే వుంది, ఎప్పుడూ అటువంటి రాత్రి అనుభవాలు ఆమె రాయలా. ఎందుచేతనంటే ఆవిడ రాసిన కథలు ఆ రాత్రి రాక మునుపే అంతమై పోయేవి.

ఒక్క ముక్కలో చెప్పాలంటే ఆవిడవన్నీ పవిత్రమైన భావాలు. కథల్లో రెండు పార్టీలు. చెడ్డవాళ్లు కథ చివరన చచ్చి అయినా పోయేవాళ్లు లేదా వోడిపోయే వాళ్లు. ఒక్కొక్కప్పుడు పశ్చాత్తాప పడేవాళ్లు కూడా, మంచితనమూ, ప్రేమా చివరకు గెలుస్తాయి. వీటిని బట్టి లలితా కుమారి ఆదర్శాలు మనం తెలుసుకోవచ్చు.

ప్రస్తుతం ఆవిడ మనస్సును చికాకు పరుస్తున్నదేమిటంటే, ఆమె కోసం తలిదండ్రులు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. ఓ డజను సంబంధాలు ఎరుకలో ఉన్నాయి. ఇంకొక రెండు డజన్లయినా రావచ్చు. లలితా కుమారికి పెళ్లి చెయ్యాలనే జిజ్ఞాస ఆమె తండ్రిని వేధిస్తున్నదీ మధ్య. ఆమెకు పెళ్లి కాదనే దిగులు ఆయనకి లేదు. ఆమె ఎం. ఏ. చదువు కున్నదీ, కనీసం అయిదారు సంవత్సరాల నుంచీ రచయిత్రిగా గొప్ప పేరు తెచ్చుకుంది. ఆవిడను చేసుకోమని పేపర్లో ప్రకటిస్తే ఈ రోజున కనీసం రెండు వేల దరఖాస్తు లయినా వస్తాయి. కారణమేమిటంటే ఆమె ఒక విధంగా 'ప్రాడిజీ.' ఆవిడ పదిహేనో ఏట తన మొట్ట మొదటి కథ రాసింది. ఆ తర్వాత గాండీవంలోంచి తూపులు వచ్చినట్టు ఈ అయిదారు సంవత్సరాలుగా, కథలు వెలువడుతున్నాయి. ఆవిడకు వారి వూరివాళ్లు సన్మానం ఏర్పాటు చేస్తే, ఏం మాట్లాడాలో తోచక ఏడ్చి కూచుంది — అవి ఆనంద బాష్పాలు! ఆవిడకు ఇంత అనుభవం ఎట్లా వచ్చింది చెప్మా అని ఆవిడ కథలు చదివిన జుట్టు నెరిసిన పెద్దలు సైతం ముక్కు మీద వేలు వేసుకున్నారు. కాబట్టి పెళ్లి కుమార్తెగా ఆవిడకు ఘనమైన భవిష్యత్తు వుంది. కొంత మంది గడుగ్గాయిలు ఆవిడకు ప్రేమలేఖలు గూడా రాశారని వదంతి. ఈ పుకార్లను మనం నమ్మాల్సిన అవసరం లేదనుకోండి. ఆవిడ తండ్రిని కలవరపరుస్తున్నవి ఇవేవీ కావు. ఆమె వయస్సు ఇప్పుడు ఇరవై ఒకటి. ఇంకా వయస్సు ముదరక మునుపే పెళ్లిచేసి చూడాలని ఆయన అభిలాష. అంచాత పెళ్లి సంబంధాలు చూస్తున్నారాయన. అన్ని విధాలా అనుకూలమైన సంబంధం కలిసి వస్తే, ఎంత కట్నమయినా ఇవ్వటానికి ఆయన సిద్ధంగానే ఉన్నాడు. ఆ సంగతి లలితా కుమారికి తెలీకుండా గుప్తంగా వుంచాడు. ఆవిడకు తెలిస్తే చచ్చినా పెళ్లి చేసుకోదు. పైపెచ్చు దాని మీద నాలుగైదు కథలు కూడా రాయచ్చు.

రచన:

రామన్న

ఇంతవరకు వచ్చిన సంబంధాలలో సగం తల్లిదండ్రులే పడగొట్టారు. మిగతా సగం ఆమె బుట్ట దాఖలా చేసింది. బుట్ట దాఖలా అయిన వాటిల్లో ఒకరిద్దరు అందమైన కుర్రాళ్లు లేక పోలేదు. కానీ లలితాకుమారికి కావలసింది బాహ్యాకర్షణ కాదు. హృదయ సౌందర్యం. ఆ హృదయ సౌందర్యం ఎట్లా కనిపెట్టగలదో ఆవిడకే తెలియాలి. ఆవిడ ఇంతవరకూ ఏ యువకుడికీ దగ్గరగా రాలేదు — ఆవిడ రాసే కథల్లోని ప్రధాన పాత్రలకు మల్లే. కనీసం గూఢాన్వేషించయినా ప్రేమించలేదు. భౌతికంగా ముక్కూ మొహం ఎరుగని మనిషిని ఎట్లా పెళ్లి చేసుకోవటం? పెళ్లి చేసుకున్నాక అతని అభిరుచులూ, తన అభిరుచులూ కలవక యావజ్జీవం ఘర్షణ పడాల్సి వస్తుంది.

లలితాకుమారి బుర్ర వేడెక్కింది. చేతిలో వున్న 'గోరా' పుస్తకం సోఫా మీద పెట్టి బాల్కనీలోకి వెళ్లింది. బయట పిండార బోసినట్లు వెన్నెల. కొబ్బరిచెట్ల ఆకుల మధ్య నుంచి పూర్ణ చంద్రుడు కనుపిస్తున్నాడు. ఎక్కడ నుంచో నైట్‌క్వీన్ పరిమళం వస్తోంది. వాతావరణం రసమయంగా వుంది. మెల్లిగా కదిలి తన గదిలో డ్రస్సింగ్ టేబుల్ ముందు నుంచుంది. అద్దంలో తన ప్రతిబింబం చూసుకుంది. తెల్లని కాటన్ చీర, నల్లని రవికతో, వదులుగా వేలాడుతున్న జడను ముందుకు వేసుకునే తన ప్రతిబింబాన్ని కాస్సేపు దీక్షగా చూసుకుంది. ఇక్కడ లలితాకుమారి అందం గురించి కొంచెం ప్రస్తావించటం అవసరం. ఆవూళ్లో వున్న వందమంది అందమైన అమ్మాయిల జాబితా తయారు చేస్తే, లలితాకుమారి పేరు దాంట్లో తప్పకుండా వుంటుంది. ఆమె రంభ కాదు. కాని ఆమెలో ఆకర్షణ లేకపోలేదు. కోల మొహం పెద్ద కళ్లు, పొడుగాటి జడా. ఆమెకు పూలు పెట్టుకునే అలవాటు లేదు. పూలంటే మాత్రం చాలా ఇష్టం. జడ కూడా ఎప్పుడూ వదులుగా వేసుకుంటుంది. వస్తుతా మనిషి పొడగరేమో, ఏ చీర కట్టుకున్నా తీర్చిదిద్దినట్టు ఉంటుంది. ఎప్పుడూ కాటన్ చీరలు మాత్రమే కట్టుకుంటుంది. రెండు చెవులకూ దిద్దులు తప్పితే వేరే నగలు లేవు. వుంటానికి చాలా వున్నాయి. వాటిని పెట్టుకోటం ఇష్టం లేదు. ఎప్పుడయినా వాళ్లమ్మ పోరగా పోరగా పట్టుచీర కట్టుకుని నగలు పెట్టుకునేది. ఎం. ఏ. పాసయిన తర్వాత అదీ మానేసింది. ఏ విధమైన ఆడంబరం లేకపోయినా తనలో ఉన్న ఆకర్షణ శక్తి మీద లలితాకుమారికి చాలా విశ్వాసం వుంది. అందుచేతనే తనకు వచ్చే సంబంధాలలో అవతలి వాళ్లకు తను నచ్చుతానా లేదా అనే సమస్య ఆమె తలలోకి ప్రవేశించనే లేదు. లలితాకుమారి అద్దం ముందు నుంచుని అక్కణ్నుంచి కదలి వెళ్లి హాల్లో సోఫాలోకి చేరగిలి బడింది. లలితాకుమారి తండ్రి రాఘవయ్యగారు హాల్లోకి వచ్చారు. చేతిలో ఉత్తరం ఏదో కాగితాలూ ఉన్నాయి.

"అమ్మాయి లలితా, ఏం చేస్తున్నావమ్మా?" అంటూ వచ్చి పక్కన కూచున్నారు.

"ఏం లేదు నాన్నా ఏదో పుస్తకం చదువుకుంటున్నాను." అంది లలితా కుమారి.

"ఇవ్వాళ ఓ మంచి సంబంధం వచ్చింది తల్లీ. ఇదుగో మద్రాసు నుంచి జానకి రామయ్య గారి ఉత్తరం. ఆయన ఆమధ్య ఢిల్లీ వెళ్లినప్పుడు అక్కడ రాజారావు గారని, ఓ పాత స్నేహితుని ఇంటికి వెళ్లారట. వాళ్లబ్బాయి పెళ్లికి ఉన్నాడట. ఇరవయి ఎనిమిదేళ్లు. ఢిల్లీలోనే ఇంజనీరుగా పని చేస్తున్నాడట. ఆ అబ్బాయి ఫోటోను లలితా కుమారి చేతికిచ్చారు.

లలిత ఆ ఫోటో వైపు నిర్వికారంగా చూసింది. కుర్రాడు మాత్రం బావున్నాడు. కళ్లూ, ముక్కూ, పెదిమలూ తీర్చి దిద్దినట్టున్నాయి. తెలివైన మొహం. సూటు వేసుకుని, రెండు చేతులూ పాంటు జేబుల్లో పెట్టుకుని ఠీవిగా నుంచుని ఉన్నాడు.

"ఎట్లా వున్నాడు లలితా?" ఆత్రంగా అడిగారు రాఘవయ్యగారు.

" ఫోటోలో చూడ్డానికి బాగానే కనిపిస్తున్నాడు. కానీ . . . ."

" ఈ సంబంధం దివ్యంగా కనుపిస్తోంది నాకు. రాజారావు గారి కుటుంబం కూడా నవనాగరికంగా కనుపిస్తుంది. ఆయన చాలా కాలం ఢిల్లీలో ఏదో పెద్ద ఉద్యోగంలో ఉండి రిటైరైనారట. ఆయనకు నలుగురు కొడుకులు, ఇద్దరు కూతుళ్ళానట. ముగ్గురు కొడుకులకు పెళ్ళయి మంచి ఉద్యోగాలలో ఉన్నారట. ఇతను — పేరు — మదన — పేరే ఎంత నవనాగరికంగా ఉందో — యూరప్‌లో మూడు సంవత్సరాలు ఇంజనీరింగులో ట్రెయినింగు పొంది వచ్చాడట. జీతం ఎనిమిది తొమ్మిదొందలు వుండవచ్చునని జానకి రామయ్యగారు రాశారు. ఇతని అన్న ఒకతను అమెరికాలో ఉన్నాడట. ఇంకొకతను రష్యా వెళ్లపోతున్నాడట. . . . దేవుడి దయవల్ల ఈ సంబంధం కనుక కుదిరితే ..." రాఘవయ్యగారి ఉత్సాహం గోదావరి వరదలా పొంగుతోంది.

" అదంతా ఎందుకు నాన్నా ? వాళ్ల ఐశ్వర్యం వాళ్లకే ఉంటుంది. మనకు ఒరిగేదేముంటుంది !" అంది లలిత ఈ సంబంధం తనకు నచ్చని దానల్లే.

రాఘవయ్యగారి నెత్తి మీద ఏదో బలముయినది పడ్డట్టయింది.

" అయితే నువ్వీ సంబంధానికి ఒప్పుకోవా ?" అని అడిగారు రాఘవయ్యగారు తన చెవులను తనే నమ్మలేని వాడిలా.

" ఒప్పుకోనని నేననటం లేదు. ముందు అతన్ని మనం చూడనీయండి. మనకీ వాళ్లకీ అన్నీ కుదరాలి. అతను నాకు నచ్చాలి. ఆ తర్వాత ఎన్నో విషయాలు మాట్లాడుకోవాలి. ఈలోపుగానే మనం స్వర్గం దిగివచ్చినట్లు గంతు లెందుకు వేయటం ?" అంది లలితాకుమారి నిబ్బరంగా, తన సహజ రచనా ధోరణిలో.

" అన్నీ కుదురుతాయి తల్లీ. నువ్వు సరేనంటే చాలు....... నాకు తెలుసు నువ్వు ఒప్పుకుంటావని !"

రచయిత్రి పెళ్లి

ఉత్సాహంగా భార్య వద్దకు పరుగెత్తాడు రాఘవయ్యగారు.

లలితాకుమారి తన చేతిలోనున్న ఫోటో వైపు దృష్టి మరల్చింది. " ఎంత బాగున్నాడు ?" అనుకుంది. తన తండ్రి దగ్గర తన అభిప్రాయం వెలిబుచ్చడం ఇష్టం లేదు.

సోఫాలోంచి లేచి వెళ్లి తన బెడ్ రూంలోకి వెళ్లి బెడ్‌లైటు వేసింది. పక్క మీద బోర్లా పడుకుని ఫోటోను లైటుకు దగ్గరగా పెట్టి చూడ సాగింది.

" ఇతని మనస్తత్వం నాకు తెలిస్తే ఎంత బావుణ్ను" అనుకుంది. ఇంజనీరంటే స్క్రూ డ్రైవరు పట్టుకుని వుంటాడు. కావల్ను. సాహిత్యం అంటే ఏమైనా అభిరుచి వుందో లేదో, ఇతను పెళ్లాన్ని పువ్వుల్లో పెట్టి పూజించే రకమో, లేక కుక్కలా చూసే రకమో !"

ఎంత ఆలోచించినా మదన మీద దురభిప్రాయం కలిగించుకో లేకపోయింది లలిత.

"ఛా ! ఏమిటీ వా అనుమానాలు. మనిషిని చూడందే అతని మీద అభిప్రాయం ఏర్పడటం ఎట్లా ?" అనుకుని 'గోరా' పుస్తకంలో పెట్టేసింది ఫోటోను.

లలితాకుమారి మనసులో ఏదో తెలియని అలజడి మొదయింది. దీపం ఆర్పేసి పడుకోటానికి ప్రయత్నించింది. నిద్ర రావటం లేదు. తలంతా ఆలోచనలతో నిండి వుంది. పక్క మీద అటూ ఇటూ దొర్లింది. తర్వాత పక్కమీద నుంచి లేచి బాల్కనీలోకి వెళ్లి పిట్టగోడ వానుకుని నుంచుంది. బయట చల్లని వెన్నెల. ప్రకృతి ప్రశాంతంగా వుంది. తన మానసిక స్థితి మీద కథ రాద్దామని గదిలోకి వచ్చి కాగితం, కలం తీసుకుని పక్కమీద బోర్లా పడుకుంది. లైటు వేసి కథ రాయటానికి తెల్ల కాగితం మీద కలం పెట్టింది. కలం సాగలేదు. కలం పక్కన పెట్టేసి, 'గోరా' పుస్తకం తెరిచింది. ఫోటో కింద బడ్డది. గుండెల్లో ఏదో అర్థం కాని వేగం. ఫోటో వేపే చూస్తూ పడుకుంది. ఏవో భావాలు మనసును గిలిగింతలు పెట్టసాగాయి. ఫోటో పుస్తకంలో పెట్టేసి, లైటు ఆర్పేసింది. ఆ రాత్రికి నిద్ర రావటం అసంభవం. రచయిత్రి కూడా మనిషే.



వో వారం రోజుల తర్వాత ఢిల్లీ నుంచి ఉత్తరం వచ్చింది. వచ్చే నెలలో మదన ఏదో పని మీద మద్రాసు వెళ్లబోతున్నాడట. వచ్చేటప్పుడు, పోయేటప్పుడో మధ్యలో దిగి పిల్లను చూసి పోతానని ఉత్తరం రాశాడట. వాళ్ల నాన్న, అమ్మా వాళ్ళు పిల్లను చూడ నక్కర్లేదట. అబ్బాయికి నచ్చితే వాళ్లకు నచ్చినట్టేనట. వాళ్ళు కట్నాలూ, కానుకలూ పుచ్చుకునే రకాలు కారట.

రామయ్యగారు ఈ సంబంధం కుదరాలని వెయ్యి దేవుళ్లకు మొక్కుకుంటున్నాడు.

రెండు వారాల తర్వాత మదన రానే వచ్చాడు. ఫోటోలో కంటే బావున్నాడు. ఉలెన సూట్ వేసుకుని అందంగా ఉన్నాడు. చేతిలో వో ప్లాస్టిక్ సూట్ కేస్ ఉంది. రాఘవయ్యగారు స్టేషనుకు వెళ్లి వెంట పెట్టుకుని తీసుకు వచ్చారు.

"కూచోండి. కాఫీ చెప్పివస్తా"నని రాఘవయ్యగారు డ్రాయింగు రూంలో మదనను కూచో పెట్టి లోపలికి వెళ్లారు.

మదనకు ఏం చెయ్యటానికీ తోచక గదంతా కలయ చూశాడు. గోడకు రవీంద్రనాథ్ టాగూర్ ఫోటో తగిలించి ఉంది. మరో వైపున మహాత్మా గాంధీ చిత్రం. గదికి నాలుగు వైపులా అద్దాల బీరువాలు. వాటినిండా పుస్తకాలు. వో పక్కగా రేడియోగ్రాం ఉంది. దానిమీద శివపార్వతి శిల్పం. ప్రక్కనే ఫ్లవర్‌వేస్. ఇవికాక కొన్ని దేవుళ్ల చిత్రపటాలు వేలాడేసి ఉన్నాయి. మదన ఎందుకో చిన్న నవ్వు నవ్వాడు. పుస్తకాల బీరువా దగ్గరగా వెళ్లి పుస్తకాల పేర్లు చూశాడు. ఒక అరంతా టాగూర్ పుస్తకాలు— గీతాంజలి, ఇతర పుస్తకాలు, క్రింద అరలో 'నారాయణరావు', 'వేయి పడగలు' ఆంధ్ర మహాభారతం, రామాయణం ఇత్యాది. మదన ముఖం మీద మళ్లీ చిరునవ్వు కనుపించింది.

హాల్లోకి ఎవరో వచ్చిన చప్పుడయి మదన వెనక్కు తిరిగాడు— రాఘవయ్యగారూ, లలితాకుమారి, వెనకాలగా రాఘవయ్య భార్య పార్వతమ్మగారు. ఆవిడ గుమ్మం దగ్గరనే ఆగి, చీరచెంగు చేత్తో పట్టుకుని నుంచుని ఉండి పోయింది.

లలితాకుమారి ట్రేలో మూడు కాఫీకప్పులు పట్టుకుని టీపాయ్ మీద ఉంచింది.

"మా అమ్మాయి లలితాకుమారి" అని మదనకు పరిచయం చేశారు రాఘవయ్యగారు.

"నమస్కారం." చేతులు జోడించి సిగ్గుతో తల దించుకుంది లలిత. అప్పుడు మదన చేతిలో ఉన్న పుస్తకం షెల్ఫులో పెట్టి నమస్కారం పెట్టాడు.

మదన కాసేపు నింపాదిగా లలిత వైపు చూశాడు. లలిత మదన వైపు చూసింది. రాఘవయ్యగారు మదన ముఖంవైపే చూస్తున్నాడు.

45 వ పేజీ చూడండి

రచయిత్రి పెళ్లి

12 వ పేజీ తరువాయి

"కాఫీ తీసుకోండి" అంది నెమ్మదిగా లలిత.

"థాంక్యూ." కాఫీ కప్పు అందుకున్నాడు మదన.

లలిత గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయి. తన మనసు తన అధీనంలో లేదని మాత్రం తెలుసుకుంది లలిత. తనకు ఆనందంగానే ఉందో, భయంగానే ఉందో తెలుసుకునే అస్కారం లేదు. మదన తన వైపు చూస్తున్నప్పుడు, అతని చూపుల్ని ఎదుర్కొనే ధైర్యం తనకు లేక పోయింది. అతని చూపుల్లో ఉండే వివేకం, ధైర్యం లలితను బంధించేశాయి. లలిత ఈ క్షణంలో తన మనోభావాన్ని వర్ణించ మంటే ఒక్క వాక్యం కూడా రాయలేదు. ఈ ఘట్టాన్ని ఎన్నిసార్లు తన కథల్లో చిత్రించిందో. కాని వాటికీ, దీనికీ ఏ విధమైన సంబంధం లేదని పించింది లలితకు. కాస్సేపు నిశ్శబ్దం.

ఈ నిశ్శబ్దం భయంకరంగా ఉంది లలితకు. ఆఖరుకు రాఘవయ్య గారు నిశ్శబ్దాన్ని ఛేదించారు.

"మీకు పుస్తకాలంటే ఇష్టమా ?"

మదన ఒక చిరునవ్వు నవ్వి "పుస్తకాలంటే ఇష్టం లేనివాళ్లు ఈ రోజుల్లో అరుదేమో నను కుంటాను" అన్నాడు లలిత తలెత్తి చూసింది అతని వైపు. అతను పలికే ప్రతి మాటా తన మనస్సులో 'రికార్డు' చేసుకోటానికి ప్రయత్నం చేస్తోంది.

"కానీ నాకు అట్టే తీరిక ఉండదు. ఎప్పుడైనా తీరిక ఉన్నప్పుడు పుస్తకాలు చదువుతాను, అవంటే పెద్ద మోహం లేదు" అని ముక్తసరిగా పూర్తి చేశాడు మదన. అతను తూచి తూచి మాట్లాడుతాడల్లే ఉంది. ఎక్కువ ఇంగ్లీషు మాటలు వస్తూ ఉంటాయి.

"తెలుగు పుస్తకాలూ, తెలుగు పత్రికలూ చదువుతూ ఉంటారా ?" రాఘవయ్య గారి ప్రశ్న.

మదన కొన్ని సెకన్లు వరకూ సమాధానం చెప్ప లేక చివరికి, "నిజానికి నాకు తెలుగు రాయటం, చదవటం అంత రాదు" అన్నాడు.

ఏదో పెద్ద బాంబు పేలినట్టయింది లలిత మనస్సులో.

"అక్షరాలు వచ్చు. పట్టిపట్టి చదువుతే కష్టం మీద కొద్దిగా చదవ గలను. మేమంతా ఢిల్లీలోనే పుట్టాం. మా అన్నయ్యలూ, నేనూ, మా అక్కయ్యా కాన్వెంటులోనే చదువుకున్నాం. బయట ఉర్దూ, కొంచెం పంజాబీ నేర్చుకున్నాం మా చెల్లెలు మాత్రం తెలుగు స్కూలుకు వెళ్లింది. దానికి వచ్చు తెలుగు చదవటం, రాయటం." అన్నాడు మదన పంజాయిషీ చెప్పుకునే ధోరణిలో.

లలిత మనస్సులో కలవరం తీవ్రమయింది. తన కున్న హిందీ జ్ఞానం నెమరు వేసుకోసాగింది.

రాఘవయ్యగారు వెంటనే నవ్వుతూ "అవును, కాదూ మరీ పుట్టిపెరిగింది అక్కడనే ఆయె మరి. ఇంట్లో మాత్రం తెలుగే మాట్లాడుకుంటారల్లే ఉంది" అన్నాడు కూరల బేరం చేస్తున్న వాడిలా.

"అవును, తెలుగే మాట్లాడుతాం. నిజానికి మా అందరిలోకీ తెలుగు బాగా మాట్లాడ్డం రానిది నాకే. మా అమ్మ నన్ను తిట్టేది తప్పులు మాట్లాడి నప్పుడల్లా" అని ముచ్చటగా నవ్వాడు మదన.

అతని మాటల్లో ఎంత నిజాయితీ ఉందో అని మెచ్చుకుంది పార్వతమ్మగారు దూరన్నుండి ఇదంతా చూస్తూ.

"మా అమ్మాయి తెలుగు పత్రికల్లో కథలు రాస్తూ ఉంటుంది" అని మదన ముఖంలో ఏమైనా మార్పు వస్తుందేమోనని చూశాడు రాఘవయ్యగారు.

"ఓ. ఐ. సీ" అన్నాడు మదన ముక్తసరిగా.

ఇంతకు లలితాకుమారి ఒక్క మాట మాట్లాడ లేదు. ఆమెను మదన ఒక్క ప్రశ్న వెయ్యలేదు.

ఈ నాటకం త్వరగా ముగిస్తే బాపుణ్ణనిపించింది లలితకు.

"మీరు ఇక స్నానం చేస్తారా ? వేడినీళ్ల ఏర్పాటు చేయిస్తాను." అన్నాడు రాఘవయ్యగారు.

మదన లేచి నుంచున్నాడు. రాఘవయ్యగారు అతనికోసం వో గది ఏర్పాటు చేయించారు. నౌకరు వచ్చి మదన సూట్‌కేస్ తీసుకుని గదిలో పెట్టాడు. ఆ గది లలితాకుమారిది. దక్షిణంవైపు ఉంది. గాలి బాగా వస్తుందని ఆ గదిని అతనికి ఏర్పాటు చేశారు. లలితాకుమారికి ఆ గది అతనికివ్వటం ఇష్టంలేదు ఆ గదిలో తన కిష్టమైన పుస్తకాలూ వస్తువులూ ఉన్నాయి. ఆ గదిలోనే తన బాల్యం గడిచి, యౌవనం ప్రవేశించింది. ఆ పక్క మీదనే తను రోజూ పడుకుంటుంది. తనకు అత్యంత ప్రియమైనదేదో తన వద్ద నుంచి పోతున్నట్టనిపించింది.

న్న...న్న...స్సార్! వా...
వ్వా...వాడికి.

న...న...నత్తిసార్!! ఆ...
ఆ ఉద్యోగము...న...న...
నాకు యిప్పించండి సాక్!

రామసుబ్బారెడ్డి (పుల్లపేట)

స్నానం అయినాక అంతా భోజనానికి కూచున్నారు. లలిత కూడా తల్లికి తోడుగా వడ్డించింది. భోజనాలప్పుడు ఏమీ మాటలు జరగలేదు.

నెయ్యి కావాలా అని లలిత అడుగుతే "వద్దు", "ఊఁ" అని మాత్రం వూరుకున్నాడు మదన. ఏ వస్తువూ రెండోసారి వేయించుకోలేద తను. సేమియా పరమాన్నం రెండోసారి వెయ్యపోతే రెండు చేతులూ అడ్డం పెట్టాడు.

"ఈ మనిషి కొంచెం కూడా నా కర్థం కావటం లేదు" అనుకుంది లలిత.

భోజనా లయిన తర్వాత మదన గదిలోకి వెళ్లి పడుకున్నాడు.

"అబ్బాయి ఎట్లా ఉన్నాడే ?" అని అడిగింది పార్వతమ్మ కూతుర్ని.

"ఇంత వరకూ ఏమీ తెలియలా" అంది లలిత.

"ఏం చోద్యమే ?" అని బుగ్గలు నొక్కుకుంది పార్వతమ్మ.

మధ్యాహ్నం మూడు గంటలకు టీ ఇచ్చి లలితను పంపించింది పార్వతమ్మ మదన గదిలోకి.

"ఏం, నౌకరుకు ఇచ్చి పంపకూడదూ ?" అని ఎదురు తిరిగింది లలిత.

"ఛా, బాగుండదు. ఎం. ఏ. చదువుకున్న దానివి, మరీ వంటింట్లో కూచుంటే నీ మీద అతనికి ఏం అభిప్రాయం కలుగుతుంది ?" బలవంతం చేసింది పార్వతమ్మ.

పెళ్లి కాబోయే ఆడపిల్లల్ని పసిపిల్లల కంటే కనా కష్టంగా ఎందుకు చూస్తారో ఈ పెద్దవాళ్లు, లలితకు చచ్చినా అర్థం కాలేదు. తను ఈ క్షణంలో పదేళ్ల పిల్లయి పోయినట్టనిపించింది లలితకు.

నెమ్మదిగా గది తలుపు తోసుకుని లోపలకు వెళ్లింది. మదన మంచి నిద్రలో ఉన్నాడు. దగ్గరగా వెళ్లి చూసింది. నిద్రలో కూడా ఎంత అందంగా ఉన్నాడు అనుకుంది లలిత. ట్రేను పక్కనే ఉన్న బల్లమీద ఉంచింది. సగం చదువుతూ పెట్టేసిన పుస్తకం ఏదో బల్లమీద ఉంది. అదేం పుస్తకమో చూడాలని లలితకు ఆరాటం ఎక్కువ కాసాగింది. కొంపతీసి తన కథల సంపుటి ఏమైనా ఏమో !

పుస్తకం తీసుకుని అట్టచూసింది. భీకరమైన కార్మికుడి బొమ్మ, వెనకాల ఫాక్టరీ, "జాక్ లండన్" అని ఇంగ్లీషులో రాసి ఉంది. ఆ పేరు విన్నట్టు తనకు తట్టను కూడా లేదు. ఎటువంటి పుస్తకాలు చదువుతాడో ఇతను అనుకుంది లలిత. "ఇతనికి సాహిత్యం అంటే తెలియదేమో పాపం" అనుకుని జాలిపడింది. ఢిల్లీలో పుట్టి పెరిగి ఈ దిక్కు మాలిన పుస్తకాలు ఎందుకు చదువుతాడో ? ఈ మనిషి తనకు కొంచెం కూడా అర్థం కావటం లేదని మరోసారి అనుకుంది లలిత. పరధ్యానంగా అతనివైపు చూస్తుంటే, పుస్తకం చెయ్యి జారి బల్లమీద పడి పెద్ద చప్పుడైంది.

మదన గబుక్కున లేచి కూచుని, తనకు దగ్గరగా నుంచున్న లలితను చూశాడు.

లలిత కాసేపు బిత్తరపోయి "టీ. . . . . . టీ. . తెచ్చాను. . . టీ తీసుకోండి" అని నవ్వుతూ అంది.

మదన చిరునవ్వు నవ్వి "థాంక్యూ" అని, బాత్‌రూం వైపు వెళ్లాడు. లలిత అక్కడ నుంచి పారిపోయింది.

ఆ సాయంత్రం లలితాకుమారి మదనతో నది ఒడ్డుకు షికారు వెళ్లింది. వాళ్లిద్దరూ నడిచి వెళ్తూ ఉంటే, దోవన పోయే వాళ్లంతా వాళ్ల వైపే చూస్తున్నారు. ఎంత ముచ్చటగా ఉన్నారు జంట, అనే భావం కొందరి మొహాల్లో చూసింది లలిత. అతని పక్కన నడుస్తూంటే మనసులో కొద్దిగా గర్వంగా ఉంది. నది ఒడ్డు చేరేటంతవరకూ ఇద్దరి మధ్యా మాటలులేవు.

ఒడ్డున ఇసుకలో కూచున్నారు ఇద్దరూ. కాస్సేపయిన తర్వాత ఇద్దరు ఆడపిల్లలు— లలిత ఈడు వాళ్లు— అటుగా వచ్చారు. జానకీ, సుమిత్రా తనతో కాలేజీలో చదువుకున్నవాళ్లు. వాళ్లను గుర్తించి "జానకీ" అని కేకేసి "ఇప్పుడే వస్తానండి" అని మదన్‌తో చెప్పి వాళ్లడిగా వెళ్లింది.

"ఎవరే అతను ?" అడిగింది ఆత్రంగా సుమిత్ర.

"మా నాన్న స్నేహితుడే! కాదు కాదు! మా చుట్టాలు. మద్రాసు వెళ్తూ ఒక్కరోజు మా యింట్లో ఉంటానికి దిగారు" గబగబా చెప్పింది లలిత.

"ఏం నంగనాచివే? మమ్మల్ని 'ఫూల్' చేస్తున్నావా? నిన్ను చూడ్డానికే వచ్చి ఉంటాడు అతను. ఏ కథలు మా దగ్గర పనికిరావు" అంది జానకి.

తప్పుచేసి దొరికి పోయిన దాని మొహం పెట్టి, తల దించేసుకుంది లలిత.

"అదంతా ఏమీ లేదు. మీ ఊహాగానం" తప్పించుకుందామనుకుంది లలిత.

"ఎంత బాగున్నాడో? నువ్వు చాలా లక్కీ దానివే! వెంటనే పెళ్లి చేసుకోవే లలితా." అంది సుమిత్ర.

"ఓ వేళ నీకు పనికి రాకపోతే మా ఇద్దరిలో ఎవరికైనా ఇప్పు" అంది నవ్వుతూ జానకి.

"పోవే" అంది లలిత.

"కనీసం మాకు పరిచయమైనా చెయ్యవే? నువ్వొక్కదానివే ఎత్తుకు పోతావేమోనని భయం" అంది సుమిత్ర.

"నాకేం భయం లేదు. రండి."

ముగ్గురూ మదన్ కేసి నడిచారు.

వీళ్లు కూడా మదన్‌ను మెచ్చుకునేవాళ్లే. మదన్‌కు ఎన్ని సర్టిఫికెట్లో! లలితలో ఉండే 'డిఫెన్సు' మెల్లిగా సడలి పోతోంది.

వాళ్లని పరిచయం చేసింది మదన్‌కు. మదన్ వాళ్లని చాలా సోగ్గా 'గ్రీట్' చేశాడు.

కొంచెం సేపు కూచుని జానకీ, సుమిత్రా వెళ్లి పోయారు.

మదన్ వెంటనే లలితతో మాటలు కలిపాడు.

"మన పెళ్లి అయిన తర్వాత 'సమ్మర్'లో నైనితాల్ వెళ్దాం. అక్కడ నా స్నేహితుడికి బంగళా ఉంది. హాయిగా వుంటుంది. వింటర్‌లో 'సిమ్లా' వెళ్దాం. అప్పుడు మంచు పడుతుంది. నువ్వు ఎప్పుడైనా మంచు ముట్టుకుని గాశావా? అంతా 'సమ్మర్'లో సిమ్లా వెళితే మనం 'వింటర్'లో వెళ్దాం. మంచు మీద స్కేటింగు చెయ్యవచ్చు. ఇళ్ళ కప్పులన్నీ తెల్లని రగ్గులు తొడుక్కుని ఉన్నట్టుంటాయి. భలే బాగుంటుంది. ఢిల్లీ పక్కన చూడాల్సినవి ఎన్ని ఉన్నాయో తెలుసా! పోనీ స్పేసెస్ ...." మదన్ ఏవో చెప్పుకుంటూ పోయాడు. అతని మనస్సు జెట్ 'పేస్' స్పీడులో పరిగెత్తుతోంది. లలిత మనస్సు ఒంటెద్దు బండి నడక నడుస్తోంది. దారంతా గుంటలూ బురదా.

మదన్ మొట్ట మొదటసారి 'నువ్వు' అనటం గమనించింది లలిత. అతను అప్పుడే పెళ్లి అయి పోయినట్టు మాట్లాడుతున్నాడు.

"అదంతా పెళ్లి అయిన తర్వాతనేగా?" అంది లలిత.

"ఏం కాదా?" అన్నాడు మదన్ ఆత్రంగా.

"నేను మిమ్మల్ని చేసుకుంటానని మీకేమిటి ధైర్యం."

"ఓ యస్! అదీ ఒక పాయింటే! దాన్ని గురించి నేను ఆలోచించనేలేదు." మదన్ ఆలోచనలో పడ్డాడు.

"పదండి, వెళ్దాం. చీకటి పడుతోంది" అని లేచింది.

ఇద్దరూ నడువసాగారు.

"అయామ్ సారీ, మిస్ లలితా, నేను మిమ్మల్ని నొప్పించాను. మిమ్మల్ని బలవంతం చెయ్యలేను. మీ ఇష్టమైతేనే నన్ను పెళ్లి చేసుకోండి. నేనెంత ఫూల్‌ని! నా కిష్టమై పోతే పెళ్లి అయిపోతుందను కున్నాను. మీకు 'ఫీలింగ్సు' అనేవి వుంటాయని నాకు తట్టనే లేదు. అయామ్ రియలీ సారీ."

లలిత సమాధానం చెప్పలేదు. అతని మాటలు ఆమె గుండెల్లో తగిలాయి. కాస్సేపు నిశ్శబ్దంగా నడువ సాగారు.

మళ్లీ మదనే మాట్లాడ్డం మొదలు పెట్టాడు.

"నేను చాలా ముందుగా ప్లాను వెయ్యటం మొదలు పెట్టాను. పెళ్లి అయిన తర్వాత ఇన్నాళ్ళు రెన్ను. పారిస్ ఒకటి తీసుకుందామనుకున్నాను. వేరే మన కోసం చిన్న బంగళా, చిన్న కారూ.. అయామ్ వెరీ సారీ ...."

ఒకరు: నమస్కారమండీ. నేను మీకు జ్ఞాపకం ఉన్నానా?

జ్ఞానేశ్వరరావు: లేకేమండీ... నా జ్ఞాపకశక్తి అమోఘం! మీకు తెలియదా ఏమిటి? అప్పుడే మరిచారా, ఒకసారి మీరు నేను మరచిపోయిన చెప్పుల్ని, గొడుగును తీసుకొచ్చి ఇచ్చారే!

(ప్రకాశం (అనంతపూర్)

"పోన్లెండి. దాని గురించి మీరంత బాధ పడనవద్దు......" లలిత ఇంక పైన మాట్లాడలేక పోయింది. గుండెల్లో ఏదో ఉప్పెన లాంటిది లేస్తోంది. ఇంకా ఎక్కువ మాట్లాడితే ఏడ్చే పరిస్థితి వచ్చేటట్టుంది. ఆమె కళ్లల్లో నీళ్లు నిండినయ్. అతను చూడకుండా చీకట్లో కళ్లు తుడుచుకుంది.

ఇల్లు చేరేటంత వరకూ ఎవరూ మాట్లాడ లేదు.

"ఎక్కడెక్కడకు వెళ్లారే," అంది పార్వ తమ్మ గారు.

లలిత క్లుప్తంగా సమాధానం చెప్పింది.

రాత్రి భోజనాల దగ్గర మదన్ తను తెల్లవారు జామున వెళ్లుతున్నట్లు చెప్పాడు.

"అప్పుడేనా? రెండు మూడు రోజులుండి వెళ్లండి" అన్నాడు రాఘవయ్య గారు.

మదన్ లలిత వైపు చూశాడు. లలిత ఆ చూపును అర్థం చేసుకుంది.

"లేదండీ, నాకు అట్టే లీవ్ లేదు. మళ్లీ సోమవారానికి ఢిల్లీ చేరుకోవాలి" అన్నాడు మదన్.

భోజనాలు ముగిసిన తర్వాత మదన్ అతని గది లోనికి వెళ్లిపోయాడు.

రాఘవయ్యగారూ, పార్వతమ్మ లలితను గుచ్చి గుచ్చి అడిగారు. లలిత వాటన్నిటికీ ఏవో సమా ధానాలు చెప్పి తప్పించుకుంది.

ఆ రాత్రి లలితకు నిద్రలేదు. పక్క మీద అటూ ఇటూ దొర్లింది. తను తప్పు చేసిన చేసిన దానిలా బాధ పడింది. తనకు మళ్లీ మదన్ లాంటి వరుడు దొరుకుతాడా? ఎంత సంస్కారం ఉంది అతన్లో! ఒక్కమాట తను అనేసరికి ఎంత బాధ బాధ పడ్డాడు అతను. తను దేన్నించి తనను రక్షిం చుకోవాలని చూస్తోంది? తనలో ఏదో మార్పు వస్తోందని గ్రహించింది లలిత. ఆ మార్పు తన అంగీకారంతోనే వస్తోందా, లేక తనకు తెలియ కుండానే వస్తోందో చెప్పలేదు. తన వెనకటి జీవితమంతా ఎరుపు గదుల్లోకి జారుకుంటోంది. తనకు తెలియని ప్రపంచంలోకి కాలుపెట్ట బోతోంది.

గడియారం పన్నెండు కొట్టింది. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది.

లలిత పక్కమీద లేచి కూచుంది. అప్రయ త్నంగా ఆమె కాళ్లు మదన్ గదివేపు నడిచి వెళ్లాయి. తలుపు వారగా వేసి ఉంది. మెల్లిగా తలుపుతోసి లోపలకు వెళ్లింది. మదన మేలుకునే ఉన్నాడు. బెడ్‌లైట్ వెలుగుతోంది. మధ్యాహ్నం చదువు తున్న పుస్తకం చదువుతున్నాడు. లీలగా కదిలి వస్తున్న లలితను చూసి, కొద్దిగా పైకి లేచి కూచున్నాడు.

"ఏమండీ?" అప్రయత్నంగా అతని నోట్లోంచి వెలువడ్డాయి.

"నన్ను 'మీరు' అనకండి. నేను సాయంత్రం అన్న మాటలు మనసులో ఉంచుకోకండి. మనం 'నైనీతాల్' వెళ్దాం" అని లలిత భారంగా వెనక్కు తిరిగింది బయటకు వెళ్లటానికి. మదన గబుక్కున పక్కమీంచి లేచి ఒక్క అంగలో ఆమెను పట్టు కున్నాడు.

ఆమె రెండు బుజాల్ని పట్టుకుని "రియలీ?" అన్నాడు.

లలిత తల దించుకుంది.

మదన్ ఆమెను దగ్గరకు తీసుకుని ముద్దు పెట్టుకో బోయాడు.

లలిత అతని కౌగిట్లోంచి విడిపోయి "గుడ్ నైట్" చెప్పి వెళ్లిపోయింది. ఆ రాత్రి ఇద్దరికీ నిద్రలేదు.

తెల్లవారుజామున ఇల్లంతా అదావిడిగా ఉంది. మదన ప్రయాణ మవుతున్నాడు. లలిత గది లోంచి బయటకు రాలేదు.

* * *

లలితా మదనల పెళ్లి చాలా బాగా జరిగింది. పెళ్లికి రెండు వైపుల్నుంచి పెద్దలు చాలా మంది వచ్చారు. కొంత మంది పత్రికాధిపతులూ, రచయి తలూ లలితకు బహుమతులిచ్చారు. ఒకరిద్దరు పిల్ల కవులు లలిత మీద పద్యాలు చదివారు. అవేవీ మదనకు అర్థం కాలేదు.

లలిత మాత్రం లోలోపల చాలా గర్వపడింది. తన బావగార్లూ, ఆడబిడ్డలూ చాలా మంచివాళ్లూ సంస్కారం గలవాళ్లూ ఢిల్లీ నుంచి మదన స్నేహ

టులు వచ్చారు. వాళ్ళంతా లలితను 'భాభీ' అని పిలిచారు. మదనతో ఉర్దూలో ఏవో మాట్లాడారు. అవేవీ లలితకు అర్థం కాలేదు.

ఆ రోజు రాత్రి లలిత మొట్ట మొదటిసారి పురుష ప్రపంచంలోకి తొంగి చూసింది. ఆ అనుభవం ఆమె వర్ణించలేదు.

పెళ్ళయిన మర్నాడు లలితను తీసుకుని వెళ్ళిపోయారు. వెళ్ళే ముందు తన గదిని ఒకసారి చూసుకుంది. పుస్తకాల బీరువాలో తను రాసిన కథల సంపుటి పేజీలు తిప్పింది. తను రాసిన 'ప్రేమా—పెళ్ళీ' కథ— మొదటి బహుమతి పొందినది— లలిత చిన్నగా నవ్వుకుంది. పుస్తకం బీరువాలో పెట్టేసింది.

*   *   *

మదన ఆఫీసునుంచి వచ్చి టై వూడదీసి సోఫాలో కూలబడ్డాడు. చాలా చిరాకుగా ఉన్నాడు.

లలిత టీ కప్పు టీ పాయ్ మీద పెడుతూ "ఏం జరిగిందండీ ?" అని అడిగింది.

"స్కౌండ్రల్స్ ! నేను వర్కర్ల దగ్గర నుంచి కమీషన తీసుకుంటానట. చచ్చీ చెడీ రక్తం, చెమట వోడ్చి పనిచేసి వీళ్లకు లాభాలు తెచ్చిపెట్టిన వర్కర్లకు ఐదురూపాయలు జీతం పెంచమంటే వాళ్ల తాతసొమ్మంతా పోయినట్టు జుట్టు పీక్కుంటారు. గవర్నమెంటుకు టాక్సులు కూడా కట్టరు."

లలితకేమీ అర్థం కాలేదు. నిజానికి అతని ప్రపంచం ఆమెకు ఎప్పుడూ అర్థం కాదు. ఆ ప్రపంచంలో అన్నీ మరలూ, చక్రాలూ, స్క్రూడ్రయివర్లూ. ఎప్పుడూ ఏవో ఇంజనీరింగు పుస్తకాల చదువుతూ ఉంటాడు.

ఒక్క రోజు రాత్రి పది, పదకొండు గంటలకు వస్తాడు. ఎక్కడికి వెళ్ళారంటే యూనియన మీటింగుకు వెళ్లానంటాడు. అతను వాళ్ల ఫాక్టరీ యూనియన ప్రెసిడెంటు.

ఒకొక్కప్పుడు అనిపిస్తుంది మదన ప్రపంచం అర్థం చేసుకోలేనంత వరకూ అతని భార్యగా తనకు స్థానం లేదని, కాని అతనంటే తనకి ప్రాణం. తనకు ఏం కొరతా రాకుండా చూస్తున్నాడు. కాని ఓ పక్కన ఏదో అర్థంకాని అసంతృప్తి ఆమె మనస్సులో వేళ్లు వేసుకోసాగింది. నిజానికి తనకి కావలసింది మదన వంటి భర్త కాదు. ఆమె ఉద్దేశంలో— ఆ విషయం ఎన్నో కథల్లో పెట్టింది— భార్యా భర్తా ఇద్దరూ ఒకళ్ల ఆత్మ ఇంకొకరి ఆత్మలో కలిసి పోవాలని. అది ఎట్లా సాధ్యమో ఆమెకు తెలీదు. కనీసం ఆమె ఎరుగనన్నా ఎరుగదు. తను పెళ్లి అయినప్పటి నుంచీ జీవితానికి దగ్గరగా వస్తోంది రోజు రోజూ. ఇక్కడ వెన్నెల రాత్రులూ, పడవషికార్లూ, సాహిత్య పఠనమూ, శాంతీ ఏవీ కనుపించటం లేదు. ఇక్కడ కనుపించేదల్లా చింకి బట్టలూ, రోడ్ల మీద అడుక్కునే వాళ్ళూ, బురదా, చాలీ చాలని జీతాలూ, అనారోగ్యంతో బాధ పడే పిల్లలూ, వీళ్లంతా ఎందుకు బాధ పడతారో లలితకు చచ్చినా అర్థం కావటం లేదు.

"త్వరగా అన్నం పెట్టు మళ్లీ వెళ్లాలి" అన్నాడు బట్టలు మర్చుకుంటూ మదన.

"అదేమిటి ఇప్పుడేగా వచ్చింది ?" అంది లలిత.

"రాత్రికి యూనియన మీటింగు ఉంది వెళ్లాలి. రేపు అయిసా పయిసా తేల్చుకోవాలి. కంపెనీ వాళ్ళు ఒప్పుకోపోతే నా ఉద్యోగానికి రాజీనామా ఇస్తాను."

లలిత గుండెల్లో ఆటంబాంబులు పేలుతున్నాయి. ఈ సంవత్సరం నుంచీ సుఖమయంగా సాగుతున్న జీవితం అమాంతం గోతిలో పడుతుందా ఏం ఖర్మం ? మదన ఏ అఘాయిత్యం చేస్తాడో అని భయపడసాగింది లలిత.

"ఏమిటి ఈ కూరలో ఉప్పయినా వెయ్యలేదు. నానసెన్స్ ?" చిరాకు పడ్డాడు.

మాట్లాడకుండా ఉప్పు సీసా దగ్గర పెట్టింది ఆదరాబాదరా రెండు అన్నం మెతుకులు గతికి మదన బట్టలు వేసుకుని వెళ్లిపోయాడు.

రాత్రి పన్నెండు గంటలకు తిరిగి వచ్చాడు మదన్. అతను పూర్తిగా అలిసి పోయి ఉన్నాడు. ఉన్నాడు. బట్టలు మార్చుకుని లలిత పక్కన పడుకుని ఆమెపై చెయ్యివేసి నిద్రపోయాడు.

ఆలోచనలతో తర్జన భర్జన పడి ఏ తెల్లవారు జామునో లలిత నిద్రలోకి జారుకుంది.

*   *   *

ఆ మర్నాడంతా లలితకు పీడకల లాగా ఉంది. మొగుడికి అన్నం పెట్టి పంపించేసి పడుకుంది. తలంతా ఏవేవో ఆలోచనలతో నిండి ఉంది. ఈ రోజు ఎట్లా గడుస్తుందా అనిపిస్తోంది లలితకు. మదన ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేస్తాడా? సలక్షణమైన ఉద్యోగం ఎందుకు మానుకుంటాడో ? ఒక వేళ ఉద్యోగం మానేస్తే మళ్లీ ఇంకొక ఉద్యోగంలో చేరేటంత వరకూ ఎట్లా గడవటం ? అతని ఫాక్టరీలో పని చేస్తున్న వెయ్యిమంది వర్కర్లకు ఎట్లా గడుస్తుందో ఆమెకు తట్టనే లేదు. వారి భార్యలు రోజూ ఏ దేవుళ్లకు మొక్కుకుంటున్నారో ? వాళ్లను గుపించి వో కథ రాస్తే ? కాని ఎట్లా రాయటం ? వాళ్లని గురించి తనకేమీ తెలిదే ? నిజానికి తను ఇదివరకు రాసిన కథలు మాత్రం తనకు తెలిసిన వాటిని గురించి రాసిందా ? తను వూహించి, తన కిష్టమయినట్టుగా రాసింది. అడుక్కునే వాళ్ల గురించీ, గుడిసెల్లో వాళ్లగురించీ రాయటం తనవల్ల గాదు. కథరాసే ప్రయత్నం విరమించుకుంది. అసలు ఈ మధ్య కథలు రాయాలనిపించటమే లేదు. తనకు తీరికగా ఉన్న ప్రతి క్షణం మదన గురించిన ఆలోచనలే. అతన్ని పెళ్లి చేసుకున్న తర్వాత తన జీవితంలో ఎంత మార్పు ? ఇదివరకు ప్రాపంచిక బాధలకు తను అతీతంగా ఉండేది. ఇప్పుడు ఎన్నో ఆలోచనలు మదన జీవితం తుఫాను లాంటిది. అతను ఏ రోజున ఏం చేస్తాడో చెప్పటం కష్టం. ఇవ్వాళ ఆ కంపెనీ వాళ్లతో ఏం ఘర్షణ పడుతున్నాడో ? భగవాన, ఆయన్ను రక్షించు.

బయట ఎవరో కాలింగ్ బెల్ నొక్కిన చప్పుడు పరుగెత్తి వెళ్లి తలుపు తీసింది. తుఫానులా మదన్ లోపలికి వచ్చాడు. చేతిలో ఓ పాకెట్ ఉంది.

"ఏ మయిందండీ ?" ఆదుర్దాగా అడిగింది.

మదన్ లలితను నడుంచుట్టూ చేయివేసి దగ్గరకు లాక్కునిగట్టిగా ముద్దు పెట్టుకున్నాడు.

"ఏమిటిదంతా ? నాకేమీ అర్థం కావటం లేదు. ఆఫీసులో ఏమయింది ?"

"ఏమవుతుంది. మనం గెల్చాం" అన్నాడు చిన్న పిల్లవాడిలా నవ్వుతూ మదన.

ఆ నవ్వు ఎంత సేపు చూసినా తనివితీరదు. లలిత మనసు కుదుట బడింది.

"ఇదుగో, ఈ పాకెట్ నీ కోసం. ఇవ్వాళ జీతం రోజు గదూ ! అన్నట్టు మరిచిపోయా, నీకు జ్ఞాపకం ఉందా, ఈ రోజు మన పెళ్లి యానివర్సరీ. అందుకని నీకో చీర తెచ్చా. వెంటనే కట్టుకుని బయలుదేరు, వూఁ"

"ఎక్కడకి ?"

"ముందు చీరకట్టుకో ! ఏమిటే చింకిరి తలా నువ్వూనూ ? ఓడియన్‌లో ఇవ్వాళ కొత్త ఇంగ్లీషు పిక్చరు గుప్తా ఆయన భార్యా కూడా వస్తున్నారు. టిక్కెట్లు గూడా రిజర్వు అయినయి. కమాన" అంటూ లలితను తరిమాడు మదన్.

లలితకు ఆలోచించేటంత టైము గూడా లేదు.

"ఏం మనిషో ఏమిటో" అనుకుంటూ మొగుడి వేపు చూసి మూతి బిగించి చరచరా గదిలోకి వెళ్లిపోయింది. లలితాకుమారి కాదు— శ్రీమతి లలితా కుమారి. ★